క్లుప్తంగా

నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను మూడురోజులపాటు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధానార్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30గంటలకు నూతన సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయ స్వామి వారి విగ్రహాలకు సంప్రోక్షణ, అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, కంకణధారణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం విగ్రహాలకు జలాధివాసం, పుష్పాదివాసం, ధాన్యాధివారం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ సీతారామ కల్యాణాన్ని నిర్వహిస్తామని వివరించారు.

నేడు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై పోటీలు

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై ఇప్పటికే నగరంలోని వివిధ పాఠశాలల్లో చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఫైనల్స్ జరుగుతాయని.. పర్యావరణ హితమైన వస్తువులు ఏమేమున్నాయి, వాటిని ఎలా వాడొచ్చు, ఎందుకు వాడాలి వంటి విషయాలు చిన్నతనంలోనే తెలుస్తుందని తెలిపారు. విద్యార్థులు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై తెలుసుకోవడంతో వారి కుటుంబాల్లో కూడా మార్పు వస్తుందని వివరించారు.

అంతరిక్ష పరిశోధనలు దేశానికి గర్వకారణం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ వ్యోమగామి రాకేష్‌శర్మ అంతరిక్షంలోకి అడుగు పెట్టి 41ఏళ్ల పూర్తయిన సందర్భంగా కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్‌స్కూల్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు అధ్యక్షత వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈసందర్భంగా ఎన్వీ రావు మాట్లాడుతూ రాకేష్‌శర్మ అంతరిక్షంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి మనదేశం ఎన్నో అంతరిక్ష ప్రయోగాలు చేస్తూ విజయాలను అందుకుంటోందన్నారు. భారతీయులంతా గర్వించే రీతిలో నేడు ఇస్రో అనేక విజయాలను సాధిస్తుందని విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్ ప్రాజెక్టుకు రాకేష్‌శర్మ అడ్వైజర్‌గా పనిచేయడం సంతోషదాయకమన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో దేశం మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

భర్త వేధింపులపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు గొల్లపూడి గ్రామానికి చెందిన పదిలం పద్మావతి, రామనాథం చారి భార్యభర్తలు. వీరికి 30ఏళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు. పద్మావతి సొసైటీ బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తోంది. పద్మావతిని భర్త రోజూ అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఏడాది కిందట భార్యాబిడ్డలను వదిలి వెళ్లిపోయాడు. ఈక్రమంలో భర్తను పిలిపించి తనకు న్యాయం చేయాలని కోరుతూ పద్మావతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం):శ్రీరామ నవమి సందర్భంగా కొటికలపూడిలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. కొటికలపూడి అంబేడ్కర్‌యూత్, కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎంపీపీ పాలడుగు జోత్స్న, కూటమి నేతలు ప్రారంభించారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగిన మొదటి మ్యాచ్‌లో కృష్ణా, విజయనగరం జిల్లా జట్లు తలపడ్డాయి.

కాలనీలో కనిపించని 'ప్రగతి'

- నేటికీ మట్టి రోడ్లే దిక్కు
- కానరాని డ్రైనేజీ వ్యవస్థ
- అధ్వానంగా పరిసరాలు



అభివృద్ధికి నోచుకోని ప్రగతినగర్ కాలనీలోని మట్టిరోడ్డు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానిపురంలోని మహమ్మదీయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ప్రగతి నగర్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కనీస వసతులకు నోచుకోక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఇంకా రోడ్లు డ్రైయిన్లు, మౌలిక సదుపాయాలులేని ప్రాంతం ప్రగతినగర్ కాలనీయేనని స్థానికులు చెబుతున్నారు. తమకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారని వారు వాపోతున్నారు.

పూడిపోయిన ఓపెన్ డ్రైయిన్లు..

భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీకి అనుకుని ఉన్న ప్రగతినగర్ కాలనీ 40ఏళ్ల కిందట ఏర్పాటైంది. భవానీపురంలో ప్రతి రోడ్డు తళతళలాడుతోంటే ఈ కాలనీలో ఇప్పటికే మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. కాలనీలో ఉన్న 9రోడ్లలో ఏ ఒక్కటీ బీటీగానీ, సిమెంట్ రోడ్డుగానీ లేదు. 41,42 డివిజన్లలో కొంత భాగంగా ఉన్న ఈ కాలనీలో డ్రైయిన్లు లేవు. ఓపెన్ డ్రైయిన్లు పూడిపోయాయి. అండర్ గ్రౌండ్ డ్రైయిన్ల నిర్మాణం చేపట్టలేదు. మట్టి రోడ్లు మార్జిన్లలో పిచ్చిమొక్కలు మొలిచి పరిసరాలు అధ్వాన్నంగా మారాయి.

ఓపెన్ డ్రైయిన్లు పూర్తిగా ధ్వంసమైపోయాయి. అవస్థల్లో కాలనీవాసులు..

వర్షకాలం వస్తే మురుగునీరంతా రోడ్లపైనే చేరుతోంది. ఎటు చూసినా ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. రోడ్లు ఎగుడు దిగుడుగా ఉండడం



అధ్వానంగా ఉన్న సైడ్ డ్రైయిన్లు

తోపాటు గుంతలమయం కావడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో పందులు సంచారం అధికంగా ఉంది. దోమల వృద్ధి కారణంగా జనం ఇబ్బందిపడుతున్నారు. సరైన రోడ్లు, డ్రైయినేజీ, అండర్ గ్రౌండ్ డ్రైయినేజ్ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని రోడ్లను కాలనీ వాసులే కొంతమేర అభివృద్ధి చేసుకున్నారు.

పట్టించుకోని అధికారులు..

వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డు నుంచి భవానిపురం హౌసింగ్ బోర్డుకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్డులో మార్జిన్ అధ్వాన్నంగా తయారైంది. ప్రస్తుతం ఈ రోడ్డుకు మరమ్మతులు సాగుతున్నాయి. ఇక మిగిలిన రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నా కాలనీ అభివృద్ధిని మాత్రం అధికారులు నోచుకోవడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి గృహ నిర్మాణాలు చేపడుతున్నామని, వసతులు లేకపోవడం, పరిసరాలు అధ్వాన్నంగా ఉండడంతో వాటిలో నివసించే పరిస్థితి లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రగతినగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, డ్రైయిన్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. వర్షకాలం రాకముందే కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం : ఆసిఫ్



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. బిల్లు ఆమోదం ముస్లిం మైనార్టీలపై మోడీ ప్రభుత్వం సాగిస్తున్న అతి పెద్ద దాడి అని పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసిఫ్ మాట్లాడుతూ లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడం ముస్లింలకు బ్లాక్‌డేగా పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికి చెందుతాయని కేంద్ర మైనార్టీశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాట్లాడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది కోట్ల విలువగల వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకునే కుట్రలో భాగంగానే బీజేపీ ప్రభుత్వం ఈ సవరణ బిల్లు తీసుకొచ్చిందన్నారు. దేశంలో మైనార్టీలను ద్వితీయశ్రేణి పౌరులుగా ఎన్డీయే ప్రభుత్వం పరిగణిస్తోందన్నారు. మైనార్టీలను రాజకీయంగా సమాధి చేసేందుకే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. దానం చేసిన భూముల్లో ఉన్న మసీదులు, దర్గాలు, స్మశానాలు వంటి వాటికి ఆధారాలు చూపమనడం ఏమిటని ప్రశ్నించారు. అలా చూపకపోతే అది వక్ఫ్ ఆస్తి కాదని చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. వక్ఫ్‌బోర్డులో ఇతర మతస్తులను ఎలా నియమిస్తారంటూ మండిపడ్డారు. కూటమి పార్టీల ఎంపీలంతా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు మొదటి నుంచి మైనార్టీలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. చంద్రబాబు కేవలం తన స్వార్థం కోసం రాష్ట్రంలోని 50 లక్షల మంది మైనార్టీల మనోభావాలను దెబ్బతీశాడని దుయ్యబట్టారు. చివరికి విజయవాడలో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్‌ను కూడా లేకుండా చేశారని గుర్తుచేశారు. పార్లమెంటులో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఎంపీలు గళం విప్పడం ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సిగ్గుంటే కూటమిలోని ముస్లిం నేతలు వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేయాలని ఆసిఫ్ డిమాండ్ చేశారు.

47వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 47వ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గోదావరి గంగ గురువారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని టీనర్ పేట క్రాస్ రోడ్స్, గండమాల అచ్చమ్మ వీధిలో బాక్స్ కల్వర్ట్‌కు శాబ్, గ్రాటింగ్స్, జొన్నలగడ్డ మస్తాన్ వీధితోపాటు కాశీపతి వీధిలో మెట్లు, సైడ్ డ్రెయిన్స్ మరమ్మతుల పనులకు రూ.16 లక్షలు మంజూరు కావడంతో పనులను మొదలు పెట్టామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాను కార్పొరేటర్‌గా ఎన్నికయిన దగ్గర నుంచి డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశామని తెలిపారు. నేటికీ డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని సంబధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఇంకా సమస్యలు ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నగరపాలక సంస్థ ఏఈ శ్రీనివాస్, గోదావరి బాబు, స్థానికులు పాల్గొన్నారు.

6న హెచ్‌బీకాలనీలో స్వామివారి కల్యాణోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించకుని ఈనెల 6వ తేదీన భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని శ్రీకోదండరామస్వామి దేవాలయంలో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీశివరామ భక్త మండలి అధ్యక్ష, కార్యదర్శులు జింకా చక్రధర్, పోలు సాంబశివరావు, కోశాధికారి గుగ్గిలం శివ నాగ సుబ్రహ్మణ్య గుప్తా గురువారం తెలిపారు. 5వ తేదీన శ్రీసీతారాయచంద్రుల మూలవిరాట్‌లకు పంచామృత అభిషేకం, ప్రాతఃకాలార్చన, మన్యుసూక్త విధానంలో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన, శ్రీరామచంద్రులకు ఉపనయనం, పెండ్లి కుమారుడిని, సీతమ్మవారిని పెళ్లి కుమార్తెను చేయనున్నట్లు వివరించారు. 6వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు స్వామివారి కళ్యాణాన్ని వైభోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 108మంది దంపతులతో కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు హాకీ జిల్లా జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఎన్టీఆర్ జిల్లా జట్టును ఈ నెల నాలుగో తేదీ శుక్రవారం ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా హాకీ సంఘం కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. సింగ్‌నగర్‌లోని ఎంబీపీ స్టేడియంలో ఉదయం 7 గంటలకు జట్టును ఎంపిక చేస్తామన్నారు. 2006 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో సంప్రదించాలని సూచించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల ఆరో తేదీ నుంచి శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలి

రవాణా శాఖ అదనపు కమిషనర్ రమ్యశ్రీ



ఏటీసీ రమ్యశ్రీని సన్మానిస్తున్న రవాణా శాఖ ఉద్యోగుల సంఘం నేతలు

విజయవాడస్పోర్ట్స్: ప్రజలు కోరుకున్న సేవలను అందించడానికి ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని రవాణా శాఖ అదనపు కమిషనర్ (ఏటీసీ) రమ్యశ్రీ సూచించారు. ఏటీసీగా బాధ్యతలు చేపట్టిన రమ్యశ్రీ ని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్ 2 కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఏటీసీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించి శాఖకు మంచి పేరు తేవడానికి అధికారులు, ఉద్యోగులు ఉండాలన్నారు. ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జోన్-2 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ మొట్టమొదటి మహిళ ఆర్టీవోగా రవాణాశాఖలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, మొట్టమొదటి మహిళ అదనపు రవాణా కమిషనర్ స్థానానికి రమ్యశ్రీ చేరుకోవడం అభినందనీయమన్నారు. జోన్ 2 సంఘం సహాధ్యక్షుడు డి.రామ్మూర్తి, ఉపాధ్యక్షులు వి.నాగశంకర్, ప్రియాంక, కోశాధికారి కె.రామచంద్రరాజు, కార్యనిర్వాహణ కార్యదర్శి బి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఆర్‌లో సీబీఎస్‌ఈ బోధన



సీబీఎస్‌ఈ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న టీ శేషయ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని ఎంఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సీబీఎస్‌ఈ బోధనా తరగతులను ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు టి శేషయ్య గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్‌ఈ తరగతులు ప్రారంభించడం హిందూహైస్కూల్స్ కమిటీకి గర్వకారణమన్నారు. మూడు దశాబ్దాలుగా ఎంఎస్ఆర్ పాఠశాల విద్యా సేవలో తరిస్తూ ఇప్పుడు ప్రభుత్వ అనుమతితో సీబీఎస్‌ఈ తరగతులు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి విద్యాబోధన సాగిస్తున్న ఎంఎస్ఆర్ విద్యాసంస్థకు తమ కమిటీలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. పాఠశాల అధ్యక్షులు, కార్యదర్శులు మద్ది సుబ్బారావు, జీ రామారావు మాట్లాడుతూవిద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌తోపాటు ఐదు ప్రత్యేక లాబ్‌ల ద్వారా శిక్షణా బోధన సాగిస్తున్నట్లు తెలిపారు. కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, పీఎస్ఆర్‌సీఎంఆర్ కళాశాల కార్యదర్శి సిహెచ్ అమర సుధీర్, చిట్టూరి హైస్కూల్ కార్యదర్శి డాక్టర్ ఎస్ మణికంఠ, కమిటీ ప్రముఖులు కేఎల్వీ మోహనరావు, కమిటీ ఏవో డాక్టర్ నారాయణరావు, కోశాధికారి జే నాగశ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి పీ శైలజ, పాఠశాల హెచ్‌ఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు చెప్పండి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



వెలంపల్లిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితా కిషోర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పటిష్టతకు నూతనంగా నియమితులైన నేతలు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన శిరంశెట్టి పూర్ణచంద్రరావు, పార్టీ పశ్చిమ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడిగా నియమితుడైన పెరుమాళ్ల సత్యనారాయణ, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడిగా నియమితులైన అయితా కిషోర్ తదితరులు వేర్వేరుగా వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. వారికి వెలంపల్లి అభినందనలు తెలిపారు. ఆయా విభాగాలకు చెందిన నేతలు పాల్గొని తమ నేతలను నియమించినందుకు వెలంపల్లికి ధన్యవాదాలు తెలిపారు.

ముస్లింలకు ద్రోహం చేసిన కూటమి ప్రభుత్వం

జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్



మాట్లాడుతున్న రెహమతున్నీసా, ఇర్ఫాన్

వించిపేట(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ద్వారా చంద్రబాబు నాయుడు ముస్లిం సమాజంపై తమకు ఉన్న వ్యతిరేకతను బయటపెట్టారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకులు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. గురువారం వించిపేట, నైజాంగేటుసెంటర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా ముస్లిం సమాజానికి చెందిన వక్ఫ్ భూములను ముస్లిముల నుంచి లాక్కునేందుకు మోడి ప్రభుత్వం పన్నిన కుట్రలో చంద్రబాబు నాయుడు భాగస్వామి అయ్యారని, తద్వారా ముస్లిం సమాజానికి కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 29లకు తూట్లు పొడుస్తూ మోడి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ఇతర ధర్మాలకు దేనికీ లేని విధంగా ముస్లింలకు చెందిన వక్ఫ్‌బోర్డులో ఇతర ధర్మాలకు చెందిన వారికి అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. ఇది ముమ్మాటికి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమే అవుతుందని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేస్తూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళుతూ ఉపముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవులతో గౌరవించిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలందరూ గమనిస్తున్నారని తగిన సమయంలో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెపుతారని గౌస్ మొహిద్దీన్ హెచ్చరించారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం రాజ్యాంగ విరుద్ధం : కార్పొరేటర్లు రెహమతున్నీసా, ఇర్ఫాన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందటం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ 38, 41 డివిజన్ల కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, మహ్మద్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. గురువారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వక్ఫ్‌బోర్డ్‌లో ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం కల్పించడం ఆర్టికల్ 26 ద్వారా రాజ్యాంగం కల్పించిన మతపరమైన హక్కుకు వ్యతిరేకమని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. వక్ఫ్ బిల్లుకు మద్దతుగా నిలిచిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల పట్ల మొసలి కన్నీళ్లు కారుస్తోందని మండిపడ్డారు. టీడీపీ మొదట నుంచి ముస్లిం మైనార్టీల మనోభావాలకు విరుద్ధంగానే వ్యవహరిస్తోందని, 2014లో ముస్లింలకు మంత్రివర్గంలో స్థానం కల్పించక పోవడమే అందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు పాలనలో గుంటూరులో జరిగిన సభలో ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు పెట్టి వేధించిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆది నుంచి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని, అందుకే వారికి అండగా నిలబడేందుకు వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారని పేర్కొన్నారు. బిల్లుపై వైఎస్సార్ సీపీతోపాటు పలు విపక్షాలు అభ్యంతరాలను లేవనెత్తినా కేంద్రప్రభుత్వం పట్టించయుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీలపట్ల చంద్రబాబు కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని టీడీపీలోని ముస్లింలు తెలుసుకుని చంద్రబాబు ఉచ్చులో నుంచి బయటపడాలని కోరారు.

సాంకేతికతను జోడిస్తే అద్భుత వ్యాపార ప్రగతి



శిక్షణ ఇస్తున్న నిపుణుడు పవన్‌కల్యాణ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పెగా వంటి అధునాతన అప్లికేషన్లను వినియోగించుకోవడం ద్వారా వాణిజ్యరంగంలో ఉన్నతమైన ప్రగతి సాధించవచ్చని ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణుడు జీ పవన్ కల్యాణ్ అన్నారు. 'పెగా' సాఫ్ట్‌వేర్ వినియోగంపై కేబీఎన్ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల కార్యశాల గురువారం ప్రారంభమైంది. ముఖ్యవక్తగా హాజరైన పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పెగా వంటి అప్లికేషన్లు స్వయంచాలకంగా పనిచేస్తాయన్నారు. వివిధ అప్లికేషన్లను అభివద్ధి చేయడానికి తగిన ప్లాట్‌ఫారంలను ఇది అందిస్తుందన్నారు. వ్యాపార అవసరాలతో పాటు వినియోగదాలు అభిరుచులు, అవసరాలను అనుగుణంగా ఫ్రేమ్‌వర్క్ తయారుచేస్తుందన్నారు. అనంతరం సాఫ్ట్ వేర్ వినియోగంపై విద్యార్థులకు వివిధ నమూనాల ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి మాట్లాడుతూ అధునాతన సాంకేతికత వినియోగంపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు కార్యశాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కారణంగా ట్రాఫిక్ అస్తవ్యస్తం



కేజీ మార్కెట్ బస్ టెర్మినల్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. వర్షంతో లోబ్రిడ్జిలో వర్షపునీరు, మురుగునీరు భారీగా నిలిచిపోయింది. దాంతో వన్‌టౌన్ నుంచి కాశేశ్వరరావు బస్‌టెర్మినల్ మీదుగా లోబ్రిడ్జిలోకి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. లోబ్రిడ్జి నుంచి మార్కెట్ మీదుగా నెహ్రూరోడ్డులోని ఆర్‌సీఎం చర్చి వరకూ భారీగా వాహనాలు నిలిచిపోవటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు లోబ్రిడ్జిలోని వాహనాలను ఒక్కొక్కటిగా ముందుకు పంపిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. సుమారు గంటపాటు ట్రాఫిక్ పరిస్థితులు గందరగోళంగా మారాయి. దాంతో వన్‌టౌన్ నుంచి టూటౌన్ వైపు వచ్చే ప్రజానీకం అల్లాడిపోయారు.

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూఏ పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లాలోని తొమ్మిది యూనిట్‌ల వద్ద కార్మికులు రెడ్ బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. అందులో భాగంగా విజయవాడలోని డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఎ.వి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం, సంస్థ స్పందించాలని డిమాండ్ చేశారు. 2019లో ఇచ్చిన సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 300కి పెంచాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ కొనుగోలు చేయాలని, గతంలో సమస్యలను ఆర్టీసీ ఎండీ పరిష్కరించాలని కోరారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, జోనల్ నాయకులు, జిల్లా, డిపో, నాయకులు పాల్గొన్నారు.

నేడు అష్టాక్షరి ఆశ్రమం నుంచి శోభాయాత్ర

7నుంచి శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ ఛాలీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీ వైష్ణవ మహా దివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని బబ్బూరి గ్రౌండ్‌లో శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ ఛాలీసా సమాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం విద్యాధరపురంలోని అష్టాక్షరి ఆశ్రమం నుంచి వందలాది మంది భక్తులతో శోభాయాత్ర ప్రారంభమై పురవీధుల మీదుగా బబ్బూరి గ్రౌండ్ ప్రాంగణానికి చేరుకుంటుందని వివరించారు. కాగా పెనుమాకలో ఏడాదిపాటు నిర్విరామంగా హనుమాన్ ఛాలీసా పారాయణ చేసిన భక్తులను అయోధ్య రామమందిర దర్శనానికి తీసుకువెళతామని చెప్పారు. కృష్ణానదీ తీరంలో బబ్బూరి గ్రౌండ్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజేటి వెంకట దుర్గాప్రసాద్, తాడికొండ శ్రీనివాసరావులతో కలిసి సమాపనోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి పర్యవేక్షణలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ప్రఖ్యాత గాయకులు ఎంఎస్ రామారావు మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ సుందరకాండ (హనుమాన్ ఛాలీసా) పారాయణ చేస్తారని తెలిపారు. గుంటూరు జిల్లా పెనుమాక గ్రామంలోని శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రంలో 365 రోజులపాటు అఖండ శ్రీహనుమాన్ పారాయణ కార్యక్రమం నిర్వహించామని, ముగింపు సందర్భంగా బబ్బూరి గ్రౌండ్స్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు సుమారు 50 వేల మంది భక్తులతో హనుమాన్ ఛాలీసా పారాయణ ఏర్పాటు చేశామని వివరించారు. శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మించి తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఆలపాటి సుందరరావు, కొప్పురావూరి శ్రీమన్నారాయణ, పీ బాలగంగాధర్, ఎ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.